క్లుప్తంగా

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు



చల్లా నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మొయినాబాద్: టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల గజన్‌మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



చల్లా నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, మండల అధ్యక్షుడు మాణయ్య ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

శంకర్‌పల్లి: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని రావులపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామంలో సుమారు 275 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారికి త్వరలోనే చికిత్సలు చేయిస్తామని హామీనిచ్చారు. ఈ వైద్య శిబిరాన్ని గచ్చిబౌలి, చేవెళ్ల, శంకర్‌పల్లి సేవా సమితి వారు నిర్వహించినట్లు తెలిపారు. సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులోనూ ఈ తరహా సేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రావు

కొందుర్గు: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే సేవా పక్షోత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 17న అన్ని గ్రామాల్లో తెలంగాణ విమోచన దినం జరుపుకోవాలని సూచించారు. అదే విధంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో యువకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, బల్వంత్‌రెడ్డి, శ్రీశైలం, అంజయ్య, అశోక్, కార్తీక్, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వేధిస్తున్న చెత్త సమస్య

- నిరుపయోగంగా డంప్‌యార్డులు
- బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారబోత
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే సంకల్పంతో గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా లక్షలు వెచ్చించి డంపింగ్‌యార్డులను నిర్మించారు. అయితే వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

అవగాహన లోపం..

మండల కేంద్రమైన కొందుర్గులో గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి డంప్‌యార్డులు నిర్మించారు. సాధారణంగా గ్రామానికి ఒక డంపింగ్‌యార్డు నిర్మించాలి. కానీ కొందుర్గులో రెండు సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. కానీ అవగాహన లోపంతో మున్సిపల్ సిబ్బంది బహిరంగ స్థలాల్లో చెత్తవేస్తున్నారు. మొదటగా కొందుర్గు నుంచి చెక్కలోనిగూడ వెళ్లేదారిలో రూ.2 లక్షలు ఖర్చు చేసి డంపింగ్‌యార్డు నిర్మించారు. అయితే గాలి రావడంతో రేకులు ఎగిరిపోయి ఉపయోగంలో లేకుండా పోయింది. రెండోసారి స్కాన్ ఎనర్జీ పరిశ్రమ పక్కన రూ.2.40 లక్షలు ఖర్చుచేసి నిర్మించారు. ప్రస్తుతం ఆ ప్రదేశంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించేందుకు ఎంపిక కావడంతో అక్కడ చెత్త వేయొద్దని అధికారులు ఆదేశించారు. గ్రామంలో దాదాపు 5వేల వరకు జనాభా ఉంటుంది. వారందరికీ చెత్త ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. చాలా మంది గ్రామస్తులు బహిరంగ ప్రదేశాల్లోనే చెత్తవేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోందని, దోమల బెడదతో రోగాల బారిన పడే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటనే సరైన స్థలాన్ని ఎంపిక చేసి డంపింగ్‌యార్డు నిర్మిస్తే ఈ సమస్య ఉండేది కాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కొందుర్గులో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు



బస్టాండ్ ఆవరణలో పడేసిన చెత్త

> **ఉన్నతాధికారులకు నివేదించాం**
>
> ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేటాయించిన స్థలం ఆవరణలో డంపింగ్‌యార్డు ఉండటంతో అక్కడ చెత్త వేయొద్దని అధికారులు సూచించారు. దీంతో మరో స్థలాన్ని తమకు చూపాలని ఎంపీఓతో పాటు రెవెన్యూ అధికారులను కోరాం. ఇంకా అధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. స్థలం చూపిన అనంతరం డంపింగ్‌యార్డు నిర్మించుకుంటాం.
>
> –సురేఖ, పంచాయతీ కార్యదర్శి, కొందుర్గు

బహుముఖ ప్రజ్ఞాశాలి బూర్గుల

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బూర్గుల వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ, జేఏసీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా జాతీయ ఉద్యమంలో పాల్గొని ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు బూర్గుల రామకృష్ణారావు అని కొనియాడారు. భూస్వామ్య జాగీర్దార్ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు కౌలు, వ్యవసాయ భూముల సవరణ చట్టాలను తీసుకొచ్చి పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. విద్యారంగంలో కూడా అనేక సంస్కరణలు తీసుకొచ్చి నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేశారన్నారు. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని, ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, కృష్ణారెడ్డి, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, రాజు, బాల్‌రాజ్‌గౌడ్, అప్పి, కరుణాకర్, ఆంజనేయులు, శేఖర్, పెంటయ్య, అంజి యాదవ్, గోపాల్ నాయక్, శీను నాయక్, అర్జున్ లక్ష్మణ్, తుపాకుల శేఖర్, మాణిక్యం, సీతారాం, సుదర్శన్, భాస్కర్‌గౌడ్, జనార్దన్, టీజీ శ్రీనివాస్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

పెత్తందార్లకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం

రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: నిజాం పాలనలో ప్రజలపై చేస్తున్న అరాచకాలు, అణిచివేతను తిప్పి కొట్టేందుకే ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని చేపట్టామని రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం–అమరుల త్యాగాలు' అనే అంశంపై టీఎస్‌యూటీఎఫ్, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. నాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రాంతం నిజాం సైన్యం అండతో గ్రామాల్లోని జాగీర్దార్లు, జమీందార్లు, దేశ్‌ముఖ్, భూ స్వాములు ప్రజలను తీవ్ర అణిచివేతకు గురి చేసేవారన్నారు. దీంతో ప్రజలందరూ కులమతాలకతీతంగా ఏకమై కమ్యూనిస్టుల నాయకత్వంలో నిజాం సైన్యమైన రజాకర్లకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం కొనసాగిందన్నారు. వాస్తవాలను, చరిత్రను మన ముందు తరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సెమినార్‌లో ప్రజా సంఘాల నాయకులు వెంకటరమణ, రాజు, శ్రీనునాయక్, రవీంద్రనాథ్, కుర్మయ్య, కరుణాకర్, టీజీ.శ్రీనివాస్, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు జనార్దన్, సత్యం, బాలయ్య, కృష్ణ, శ్రీకాంత్, లక్ష్మీదేవమ్మ, అరుణ, రాములు, శివారెడ్డి, వెంకటయ్య, రవికుమార్, వినీత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి

విశ్రాంత గణిత ఉపాధ్యాయుడు పాండురంగయ్య



పాండురంగయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని మరింత పెంపొందించాలని విశ్రాంత గణిత ఉపాధ్యాయుడు పాండురంగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు గణితాన్ని సమర్థవంతంగా నేర్పించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గణితాన్ని ఆచరణాత్మక పద్ధతుల్లో నేర్పించాలని, ఒక సమస్యను పరిష్కరించడానికి వివిధ మార్గాలను చూపించాలన్నారు. గణితాన్ని కేవలం పాఠశాల విషయం కాకుండా, నిజమైన జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో నేర్పించాలని సూచించారు. అనంతరం పాండురంగయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవిప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ యూత్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు, గ్రామస్తులతో మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: గ్రామాల్లోని యువత రాజకీయాల్లోకి రావాలని మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండకల్‌లో గ్రామ బీఆర్ఎస్ పార్టీ యూత్ కమిటీని ఎన్నుకోగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ అధ్యక్షుడిగా రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా కే.అనిల్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని యువత బయటకు రావాలని, రాబోయే రోజుల్లో రాజకీయాల్లో వారిదే కీలకపాత్ర అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బి.సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సేవా సమితి కార్యవర్గం ఎన్నిక

కేశంపేట: రెడ్డి సేవా సమితి కేశంపేట గ్రామ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా తలసాని రాంరెడ్డి, అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తలసాని ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, సభ్యులుగా మంద పురుషోత్తంరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రమణరెడ్డి, హరికిషన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విమోచనం' ఘనంగా నిర్వహించాలి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కొత్తూరు: ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విమోచన దినోత్సవం, మోదీ జన్మదినం సందర్భంగా సేవ పక్వాడ్ కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 02 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా హైదరాబాద్ విమోచనం, స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుల చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలని కోరారు. అంతేగాకుండా పలు సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, మల్లేశ్, నాగరాజుచారి, శేఖర్, గణేష్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



జలకళను సంతరించుకున్న చిలుకూరు చెరువు



నిండుకుండలా సురంగల్ పెద్ద చెరువు

మొయినాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు పెద్ద చెరువు, ఎనికేపల్లి మాలకుంట, జీవన్‌గూడలోని బంగాలి కుంట, సురంగల్ పెద్దచెరువులు పూర్తిగా నిండి నిండుకుండలా మారాయి. చిలుకూరు పెద్ద చెరువు గత ఇరవై రోజులుగా అలుగు పారుతూనే ఉంది. ఎనికేపల్లి మాలకుంట పూర్తిగా నిండి పదిహేను రోజులుగా దిగువకు నీళ్లు వెళ్తున్నాయి. సురంగల్ పెద్ద చెరువులోనూ పూర్తిస్థాయిలో నీరు నిండడంతో వారం రోజులుగా అలుగు పారుతోంది. ఈసారి వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండడంతో బోరుబావుల్లో సైతం నీటి మట్టం పెరిగింది.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీశైలం



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నందిగామ: గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంకాల శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని చేగూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం మంకాల శ్రీశైలం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల శివశంకర్, పబ్బె రవితేజ, కావలి భీమయ్య, రాజశేఖర్, బుగ్గేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి



కౌకుంట్లలో గ్రామస్తులకు మందులు అందజేస్తున్న వైద్యులు

చేవెళ్ల: పేద ప్రజలకు గ్రామాల్లోకి వచ్చి అందించే వైద్యసేవలు ఎంతో అభినందనీయమని బీఆర్ఎస్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని చేవెళ్ల, పామెన, బస్తేపూర్, ఖానాపూర్, కౌకుంట్ల, రామన్నగూడ, తంగడపల్లి, రావులపల్లి, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి.. పేద ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా నగరంలోని 12 కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యబృందంతో పేద ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలను అందించటంతో పాటు ఉచితంగా మందులు, పరీక్షలు చేశారు. మొత్తం 9 గ్రామాల్లో 12 ఆస్పత్రులు, 60 మంది వైద్యులు, 200ల మంది సిబ్బందితో వైద్యశిబిరాలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాలను ప్రారంభించి మాట్లాడుతూ.. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిలు, ఆయా గ్రామాల్లోని సత్యసాయి సేవా సమితి సభ్యులు, మండల సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బోర్డులకే పరిమితం

- నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన క్రీడాప్రాంగణాలు
- పిచ్చిమొక్కలతో నిండిన మైదానాలు
- పట్టించుకోని అధికారులు



వెంకమ్మగూడలో క్రీడా ప్రాంగణం



ఈదులపల్లిలో ఇలా..

నందిగామ: విద్యార్థులు, యువతకు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, తాము ఎంచుకున్న క్రీడల్లో నైపుణ్యం పొందడానికి గత ప్రభుత్వం గ్రామ గ్రామాన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అప్పటివరకు గ్రామాల్లో క్రీడా మైదానాలు లేక ప్రైవేటు స్థలాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో ఆడుకునే యువతీ యువకులు క్రీడా ప్రాంగణాల్లో ఆడుకోవచ్చని సంబురపడ్డారు. క్రీడా ప్రాంగణాల బోర్డులు చూసి త్వరలో క్రీడా పరికరాలు, సామగ్రి వస్తాయని ఆశించారు. కానీ, క్రీడా ప్రాంగణాల్లో పరికరాల ఊసేలేదు. కేవలం క్రీడా ప్రాంగణాల పేరిట బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. దీంతో లక్షలు వెచ్చించి నెలకొల్పిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగానే విగిలిపోయాయని, ప్రస్తుత సర్కారైనా పట్టించుకొని సౌకర్యాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు. నందిగామ మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 18 జీపీల్లో క్రీడా ప్రాంగణాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్ని గ్రామాల్లో మైదానాలు గడ్డి, పిచ్చి మొక్కలతో అడవులను తలపిస్తున్నాయి. పలు గ్రామాల్లో ఊరికి దూరంగా ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేశంపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకచోట చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు